# ముంపు

ఇంటి ముందు సైకిలు ఆపి దిగి సైకిలు గోడకు ఆనించి పుస్తకాలు అందుకుంటూ చేతిగడియారం వంక చూసుకున్నాడు సూరి. ఆరూ ఇరవయి అయిదయింది. ట్యూషన్‌కు వెళ్లి ఉంటే తను ఇంటికి చేరుకునేసరికి ఎనిమిదిన్నర అవుతుంటుంది. ఆపూట తలనొప్పిగా ఉండటాన ట్యూషన్‌కు వెళ్లాలనిపించలేదు. కాలేజీ అయిపోయాక సుమారు గంట పాటు ప్లేగ్రౌండులో వాలీబాల్ మేచ్ జరుగుతుంటే చూస్తుండిపోయాడు.

కాంపౌండు గేటు నెట్టుకుని లోపలికి వచ్చాడు సూరి. అతని పిన్ని శారద ఉద్యోగస్తురాలు. అయిదున్నరకే ఆఫీసు నుండి ఇంటికి వచ్చేస్తుంటుంది. ఎవరింటికీ వెళ్లదు. ఇంటికి కావలసిన వస్తువులన్నీ తనే తీసుకు వస్తుంటాడు. మెట్లు ఎక్కి తలుపు నెట్టాడు. వీధి తలుపు లోపల గడిపెట్టి ఉంది. తలుపు తట్టబోయి ఆగాడు. కొన్నిసార్లు శారద ఆఫీసు నుండి ఇంటికి తిరిగివచ్చిన వెంటనే గంటా, గంటన్నర పాటు నిద్రపోతుంటుంది. ఆ సమయంలో సూరి ఆమె నిద్రకు భంగం కలిగించడు. ఆమాటకొస్తే శారదకు కోపం తెప్పించేపని సూరి ఏదీ చేయడు. శారద సూరికోసం ఎంతో చేసింది. ఆమె గనక సూరిని ఆదుకోకపోయి ఉంటే ఎన్నో ఇబ్బందులు పాలయ్యేవాడు. తనేమయి పోయి ఉండేవాడో ఆలోచించటానికి కూడా సూరికి భయం వేస్తుంటుంది.

వీధి తలుపు లోపలి గడిని బయట నుండి తీయటం సూరికి తెలుసు. జేబులోంచి బాల్‌పెన్ తీసి తలుపు సందులో పెట్టి పైకి నెట్టాడు. గడి చప్పుడు కాకుండా ఊడిపోయింది. బాల్‌పెన్ తిరిగి జేబులో పెట్టుకుని తలుపు తెరుచుకుని లోపలికొచ్చి తలుపు మూసి పుస్తకాలు బీరువాలో పెట్టబోతూ గోడవారగా ఉన్న నల్లరంగు చెప్పుల జత చూస్తూ ఆగాడు. అవి ఎవరివో సూరికి తెలుసు. హైదరాబాద్ నుండి నారాయణ వచ్చి ఉంటాడు. పడకగదిలో పిన్నీ, అతను ఉండి ఉంటారు అనుకుని పడకగది వైపు చూశాడు. పడకగది తలుపు దగ్గిరగా వేసి ఉంది. లోపల లైటు వెలుగుతోంది. ఫేను తిరుగుతున్న చప్పుడు వినిపిస్తోంది. నారాయణ వచ్చిన ప్రతిసారీ మూడు నాలుగు రోజులయినా ఉండి వెళ్లిపోతుంటాడు. మొదటి రెండు రోజులూ బాగానే ఉంటారు. కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ గడిపేస్తారు. రెండు రోజుల తర్వాత అభిప్రాయ భేదాలు మొదలవుతాయి.

అప్పటివరకు ఎంతో సఖ్యంగా ఉన్నవాళ్లు తిట్టుకుంటారు. అరుచుకుంటారు. కొట్లాడుకోవటం తనెప్పుడూ చూడలేదు. పిన్ని మాటపడదని సూరికి బాగా తెలుసు.

సూరి పుస్తకాలు బీరువాలో పెట్టి కుర్చీలో కూర్చుని వంగి ట్యూబు లైటు వెలిగించాడు. సాయంకాలపు ఎండ కిటికీ దగ్గర ఆగిపోయి పల్చబడుతోంది. నారాయణ ఇక్కడకు రావటం తనకిష్టంలేదని పిన్నికి తెలుసు. అతనెందుకు వస్తుంటాడో తెలుసు కాని పిన్నితో సజావుగా ఎందుకు ఉండడో అర్థంకాలేదు. ఏదేదో అడుగుతుంటాడు. పిన్ని 'వీలుకాదు', 'నావల్లకాదు' అని కచ్చితంగా చెబుతుంటుంది. పోయినసారి వచ్చి వెళ్ళిపోతున్న రోజున కూడా చిన్న సైజు పోట్లాట జరిగింది. ఆ పోట్లాటకు కారణం తను పిన్నిని అడగలేదు. ఆమె చెప్పలేదు. పిన్ని స్వవిషయాల్లో తనెప్పుడూ జోక్యం కలిగించుకోలేదు. ఆమె ఏమయినా చేయదలిస్తే ఎన్ని అవాంతరాలు వచ్చినా చేసి తీరుతుంది. ఈ విషయం సూరికి తెలుసు. సూరి తండ్రికి కూడా ఆమె బలహీనతలు తెలుసు. తెలిసే చేసుకున్నాడు. సూరి తల్లి చనిపోయేనాటికి సూరి వయసు ఎనిమిది సంవత్సరాలు. రెండు సంవత్సరాలు గడిచాక సూరి తండ్రి శారదను పెళ్లి చేసుకున్నాడు. పెళ్లికి ఇరవయి మంది కూడా రాలేదు. సూరి తండ్రి చనిపోయినప్పుడు మటుకు బంధువులందరూ వచ్చారు. అతను చనిపోయి ఏడుసంవత్సరాలు దాటాయి. ఇప్పుడు శారద వయసు ముప్ఫయి అయిదు సంవత్సరాలు. చూడటానికి పది సంవత్సరాలు చిన్నగా కనిపిస్తుంది.

* * *

రెండు సంవత్సరాల కిందట శారదతో సూరి ఆమె బాబాయి కూతురు పెళ్లికి హైదరాబాద్ వెళ్లినప్పుడు సూరి నారాయణను మొట్టమొదటిసారిగా చూశాడు. అతను శారద బాబాయికి దగ్గిర బంధువు అవుతాడు. ముప్ఫయి సంవత్సరాల వయసు ఉంటుంది. పొడుగ్గా, ఎర్రగా, షోగ్గా ఉన్నాడు. అంత లావూ కాదు, సన్నం కాదు. అతను శారదతో చనువుగా ఉండటం గమనించి, "ఆయన నాకేమి అవుతాడు పిన్నీ?" అడిగాడు సూరి.

శారద వెంటనే జవాబు చెప్పలేదు. నారాయణ ముఖంలోకి చూసి నవ్వి, "నారాయణా! నువ్వు మా సూరికి ఏమవుతావు?" అడిగింది.

చుట్టూ ఒకసారి చూసి దగ్గిరలో ఎవరూ లేకపోయేసరికి తేలికగా ఊపిరి పీల్చుకుని, "బాబాయిని" అని శారద ముఖంలోకి చూసి "కాదా?" అడిగాడు.

"ఆఁ" అని నవ్వి శారద పైట భుజాల నిండా కప్పుకుని లోపలికి వెళ్ళిపోయింది.

ఎందుచేతనో నారాయణ అంటే మంచి అభిప్రాయం కలగలేదు సూరికి. 'బాబాయి' అని పిలవటానికి మనస్కరించలేదు.

పెళ్లయిన రాత్రి భోజనాలు అయ్యేసరికి తొమ్మిదిన్నర దాటింది. నారాయణ శారద దగ్గిరకు వచ్చి "మీకు మేడమీద గదిలో పడక ఏర్పాటు చేశాను. ముందు మీ ఇద్దరూ పైకి వెళ్ళి పడుకోండి. ఆలస్యం చేశారంటే మరెవరయినా ఆగది ఆక్రమించు కుంటారు" అన్నాడు.

శారద నారాయణను ఏదో అడగబోయి పక్కనే ఉన్న సూరిని చూసి అడగలేదు. సూరి వంక చూసి, "సూరీ, నువ్వు పైకి వెళ్లి పడుకో. కొద్దిసేపట్లో నేను వచ్చేస్తాను" అంది. వాళ్ళ పెట్టా బేడా ఆ గదిలోనే ఉన్నాయి. సూరి తలూపి మేడమీద గదికి చేరుకున్నాడు. గది చిన్నదయినా శుభ్రంగా ఉంది. రెండు పరుపులు పరిచి ఉన్నాయి. బల్లమీద టేబుల్ ఫేన్ ఉంది. ఫేన్ ఆన్ చేసి లైటు ఆర్పి తలుపు దగ్గిరగా వేసి ఒక పరుపును గోడ వారగా లాగి దానిమీద పడుకున్నాడు. దిండు లేదు. తెరిచి ఉన్న కిటికీలోంచి వెన్నెల వెలుగు పొడుగ్గా పడుతోంది. కింద పెళ్లి హడావుడి సద్దుమణుగుతోంది. కళ్లు మూసుకున్నాడు. వెంటనే నిద్ర పట్టింది.

గంట తర్వాత సూరికి దాహం వేసి మెలకువ వచ్చింది. కళ్లు తెరిచాడు. మంచినీళ్లు ఎక్కడ దొరుకుతాయో అర్థం కాలేదు. కిటికీ మూయటం వలన వెన్నెల వెలుగు అద్దంలోంచి పడుతూ పలచన అయింది. రెండో పరుపు అవతలి గోడ చివరంటా జరిగి ఉంది. రెండు పరుపుల మధ్య ఫేన్ నేలమీద ఆ పరుపు పక్కకు తిరిగి ఉంది. బయట కెళ్లి మంచి నీళ్ళు తాగొస్తే అనిపించింది. తలుపు గడి వేసి ఉంది. లేచి కూర్చుందామనుకున్నాడు. పిన్ని మాటలు వినబడుతున్నాయి. తక్కువ స్వరంతో మాట్లాడుతోంది. మాటలు స్పష్టంగా వినిపించటం లేదు. ఆమెకు అతుక్కుని నారాయణ పడుకుని ఉన్నాడు. అతని చేయి ఆమె వళ్లంతా తడుముతోంది. మీద కప్పుకున్న దుప్పటి ఫేన్ గాలికి తొలిగి పోతోంది. నారాయణ పిన్నితో చనువుగా మెలుగుతున్నందుకే కష్టం వేసింది. ఇప్పుడీ దృశ్యం చూశాక లేచి కూర్చుని బాధతో పెద్దగా అరుద్దామన్నంత కోపం వచ్చింది. పిన్ని అతనికి పడిపోతుందని తను ఊహించలేదు. కళ్లలో నీళ్లు తిరుగుతోంటే కళ్లు మూసుకున్నాడు. మనసు మౌనంగా రోదిస్తుంటే బాధా జోలలో నిద్రపట్టింది.

మరుసటి రోజు ఉదయం శారద తట్టి లేపుతోంటే సూరికి మెలకువ వచ్చి లేచి కూర్చున్నాడు. శారద తలస్నానం చేసి కొత్త చీర కట్టుకుని ఉంది. "ఎనిమిదింటికి మన ఊరు వెళ్లేందుకు బస్సు ఉంది. వెళ్దాం. త్వరగా తయారవ్వు" అంది.

ఈ మాటలకు సూరి బద్ధకం వదిలింది. లేస్తూ శారద ముఖంలోకి చూశాడు. ఆమె కుడి బుగ్గమీద పడిన గాటు పరీక్షగా చూస్తే కనబడుతోంది. రాత్రి తను చూసిన సంగతి చెబితే ఏమనుకుంటుంది? ప్రశ్నించుకున్నాడు. జవాబు దొరకలేదు.

"నేను తయారయి ఉన్నాను. నీదే ఆలస్యం. త్వరగా తెములు."

"హైదరాబాద్‌లో చార్మినార్, గోల్కొండ, మ్యూజియం ఇవన్నీ చూపిస్తానన్నావు కదా పిన్నీ?"

"ఈసారి వచ్చినప్పుడు వాటిని చూద్దాంలే" అని గుడ్డలు సర్దుకోవటంలో మునిగిపోయింది.

వాళ్లిద్దరూ గౌలిగూడ బస్సు డిపోకు చేరుకునేసరికి ఏడూ యాభయి అయింది. ఎనిమిదీ పదికి వాళ్ల ఊరు వెళ్లే బస్సు వచ్చింది. ఇద్దరూ ఎక్కి కూర్చున్నారు. అయిదు నిమిషాల తర్వాత కండక్టర్ ఎక్కి టిక్కెట్లు కొట్టటం మొదలెట్టాడు. అంతలో నారాయణ బస్సు ఎక్కి వీళ్ల దగ్గరకు వచ్చాడు. అతని చేతిని శారద తన చేతిలోకి ఆప్యాయంగా తీసుకుని జరిగి సీటిచ్చింది. ఆమె పక్కనే ఆనుకుని కూర్చున్నాడు. అతని రాకకు సూరి ఆశ్చర్యపోయాడు.

"ఏమిటిలా వచ్చారు?" అడిగింది శారద. అతని చేయి ఆమె చేతిలో ఉంది. అతని భుజం ఆమెకు తగులుతోంది. బస్సులో జనం అట్టేలేరు.

"మా స్నేహితుడొకడు విజయవాడ వెళ్తొంటే బస్సుఎక్కిద్దామని వచ్చి ఆపని ముగించాను. వెళ్తూ మీ ఊరు బస్సు కదా ఎక్కి ఉంటారో లేదో అని తొంగి చూస్తే మీరు కనిపించారు. ఇవేళ ఇంత ఉదయాన్నే వెళ్లిపోతున్నట్టు మాట వరసకయినా అనలేదేం?" నిష్ఠూరంగా అని సూరిని చూస్తూ "వాట్ సూరీ! మా ఊళ్లో ఏమీ చూడకుండానే వెళ్లిపోతున్నావు?" అన్నాడు.

సూరి నవ్వి ఊరుకున్నాడు.

"మీకు మా ఊళ్ళో చూడవలసిన ప్రదేశాలు చూడాలని అనిపించటం లేదా?" శారదను అడిగాడు నారాయణ.

"అన్ని నేను లోగడే చూశాను" అంది శారద.

"నీకు చూడాలని లేదా సూరీ?"

సూరి తలూపాడు.

"నేను రెండు మూడు రోజులు సెలవు పొడిగించాల్సి వస్తుంది" అంది మెత్తబడుతూ.

"సూరికోసం మీరు సెలవు పెట్టక తప్పదు. ఇంకో విషయం. ఇప్పుడు మీ ప్రయాణం మానుకుంటే మీ బాబాయి గారింటికి వెళ్లటం లేదు. సరాసరి మా ఇంటికి

వస్తున్నారు. మీరుండబోయే రెండుమూడు రోజులూ మా ఇంట్లోనే గడపబోతున్నారు. సరేనా?"

శారద సూరి ముఖంలోకి చూసింది. ఇలా తీయటి మాటలు చెబుతూ పిన్నిని లోబర్చుకుని ఉంటాడు. రాత్రి వాళ్లిద్దరి మీదున్నంత కోపం ఇప్పుడు లేదు. పిన్ని ఏమని జవాబు చెబుతుందో అని ఆతృతగా ఎదురుచూస్తున్నాడు. "సూరి ఇష్టమే నా ఇష్టం" అంది శారద.

"రెండు రోజులు ఉందాం."

ముగ్గురూ బస్సు దిగి డిపో బయటకు వచ్చారు. నారాయణ సైదాబాద్ కాలనీకి ఆటో రిక్షా మాట్లాడాక ముగ్గురూ రిక్షాలో కూర్చున్నారు. రిక్షా వేగం పుంజుకున్నాక నారాయణ ఆమెకు దగ్గిరగా జరిగి కూర్చున్నాడు. ఊళ్ళో ముఖ్యమయిన ప్రదేశాలు చూడబోతున్నానన్న సంతోషంతో ఉన్నాడు సూరి. అతని చూపులు రోడ్డు మీదున్నాయి.

ఇరవయి నిమిషాల తర్వాత రిక్షా నారాయణ ఇంటి ముందు ఆగింది. నారాయణ మీటరు చూసి డబ్బులిచ్చి రిక్షా దిగాడు. అతని వెనకనే శారద, సూరి దిగారు. నారాయణ ఇంటి తలుపు తాళం తీస్తుంటే "ఈయనకు పెళ్ళి కాలేదా?" అడిగాడు సూరి సూట్‌కేస్ రెండో చేతిలోకి మార్చుకుంటూ.

"అయింది. భార్య గర్భవతి. పుట్టింటికి వెళ్లింది."

"ఈయనేం చేస్తుంటారు?"

"నాకు వివరాలు అంతగా తెలియదు. ఏదో ప్రైవేటు కంపెనీలో సూపరువైజరుగా పనిచేస్తున్నానని చెప్పాడు."

నారాయణ తలుపు బార్లా తెరిచి లోపలకు నడిచాడు. వాళ్లిద్దరూ లోపలికి రాగానే తలుపు మూసి గడిపెట్టాడు. సోఫా పక్కనే సూట్‌కేస్ పెట్టి సోఫాలో కూర్చున్నాడు సూరి. గదిలోని వస్తువులు అస్తవ్యస్తంగా ఉన్నాయి. టీపాయ్ మీద చాలా పత్రికలు ఉన్నాయి. ఎవరూ శ్రద్ధ తీసుకుంటున్నట్లు అనిపించలేదు.

"రండి. మా ఇల్లు చూద్దురు గాని. మా ఆవిడ పుట్టింటికి వెళ్లాక ఆలనా పాలనా లేక చూడండి ఎలా తయారయిందో..." అంటూ పడకగదిలోకి దారి తీశాడు. శారద అతని కూడా నడుస్తూ ఒకసారి సూరి వంక చూసింది. సూరి పత్రికలు తీసుకుని చూడసాగాడు. రెండు నిమిషాల తర్వాత తలుపు చప్పుడు కాకుండా మూసుకు పోయింది.

హైదరాబాద్‌లో రెండు మూడు రోజులు మాత్రమే ఉందామనుకున్న శారద మనసు మార్చుకుని సెలవు వారాంతం వరకు పొడిగించింది. సూరికి హైదరాబాద్ చూపించే పనిని పక్కింటి కుర్రాడికి అప్పచెప్పి తన స్కూటరిచ్చాడు. మూడు రోజులకే హైదరాబాద్ మొహమొత్తి పోయింది సూరికి. ఎప్పుడు తమ ఊరుకు తిరిగి వెళ్లిపోదామా అనిపించసాగింది. ఆ బిజీ జీవితం అతనికి నచ్చలేదు. మరీ ముఖ్యంగా శారదతో నారాయణ తీసుకుంటున్న చనువు నచ్చలేదు.

వాళ్ళూరు వచ్చిన నెలరోజులకు నారాయణ మొట్టమొదటి సారిగా వాళ్లింటికి వచ్చాడు. అప్పటికి సూరి స్కూలుకు వెళ్ళిపోయాడు. శారద ఆఫీసుకు బయల్దేర బోతున్న దల్లా ఆగిపోయింది. అతను రెండు రోజులున్నాడు. ఆ రెండురోజులూ అతనామెను ఆఫీసుకు వెళ్ళనీయలేదు. 'నన్ను ఇబ్బంది పెట్టేస్తున్నావు' అంది ఇష్టంగానే. ఆ తర్వాత రెండు నెలలకొకసారో, మూడునెలలకొకసారో వచ్చి వారం రోజులుండి వెళ్ళిపోతున్నాడు. దరిమిలా వాళ్ళ సంబంధంలో రవంత మార్పు వచ్చినట్లు గమనించాడు సూరి. మొదట్లో మార్పుకు కారణం సూరికి అర్థం కాలేదు. క్రమంగా ఒకరిమీద ఒకరు అరుచుకోవటం మొదలెట్టారు. పడకగది తలుపు మూసి ఉండటం వలన వాళ్ళెందుకు పోట్లాడుకుంటున్నారో తెలిసేది కాదు. తాగి వచ్చినప్పుడు నారాయణ శారద మీద చేయిచేసుకునేవాడు. ఒకసారి మటుకు సూరి మధ్యలో వెళ్ళి ఇద్దరినీ విడదీస్తుంటే "సూరీ, అతని సంగతి నేను చూసుకుంటాను. ఇహ ఎప్పుడూ మా మధ్యలో రాకు" అంది శారద. పావుగంట తర్వాత పడకగదిలోంచి నవ్వులు వినిపించాయి. అరుచుకున్నా, తన్నుకున్నా అరగంట తర్వాత ఒకటయి పోయేవారు. సూరి వాళ్ళ విషయంలో జోక్యం కలిగించుకోవటం మానేశాడు. నారాయణ ఇంట్లో ఉన్నప్పుడు వీలయినంతవరకు బైట ఉండటానికి ప్రయత్నించేవాడు.

* * *

ఆవేళ వంట్లో బావుండక పోవటం వలన బైటకు వెళ్లలేకపోయాడు సూరి. ఏడయ్యాక వంట గదిలోకి నడిచి లైటు వెలిగించి గ్లాసుతో నీళ్లు అందుకుని తాగుతోంటే వెనక చప్పుడయ్యేసరికి నీళ్లు తాగి వెనక్కి తిరిగి చూశాడు. శారద చేతులు కట్టుకుని గుమ్మానికి ఆనుకుని నిలబడి ఉంది. తలుపు లోపల గడి పెట్టి ఉన్నా ఎలా వచ్చావని అడుగుతుందని అనుకున్నాడు సూరి. శారద అడగలేదు. "గ్లాసు మంచినీళ్ళివ్వు" అంది. సూరి ఇచ్చిన నీళ్లు తాగి ఖాళీగ్లాసు తిరిగి సూరి కందించి, "ఎంత సేపయింది నువ్వొచ్చి?"అడిగింది.

"అరగంట దాటింది."

"ఇనేళ ట్యూషన్‌కు వెళ్లలేదా?"

"వళ్లు నొప్పిగా ఉంటే వెళ్లలేదు. జ్వరం వస్తుందేమో."

శారద సూరి దగ్గిరకు వచ్చి నుదుటి మీద చేయి పెట్టి చూసి, "జ్వరం లేదు,వళ్లు నొప్పి తగ్గటానికి మాత్ర ఇస్తాను. వేసుకుంటే అరగంటలో తగ్గిపోతుంది." అగి, "నారాయణ వచ్చాడు, హఠాత్తుగా నన్ను చూడాలని అనిపించిందట వచ్చాశాడు. నేనీవేళ ఆఫీసునుండి అరగంట ముందుగానే ఇంటికి తిరిగొచ్చేసరికి మహానుభావుడు బయట మెట్లమీద కూర్చుని ఉన్నాడు" అంది.

"గదిలో ఆయన చెప్పులు చూసి వచ్చాడనుకున్నాను."

"సూరీ, ఏమీ అనుకోకుండా స్టవ్ వెలిగించి మా ఇద్దరికీ వేడి నీళ్లు పెట్టమ్మా. వళ్లంతా జిడ్డు జిడ్డుగా ఉంది" సూరి జవాబుకయి ఎదురుచూడకుండా స్నానాల గదిలోకి నడిచింది. అయిష్టంగానే స్టవ్ వెలిగించి నిండా నీళ్లున్న కాగు స్టవ్ మీద పెడుతోంటే శారద స్నానాల గదిలోంచి బయటకు వచ్చింది. "ఈ నీళ్లు చాలా?" అడిగాడు. "చాలు ఇద్దరికీ సరిపోతాయి" అని పడకగది లోకి వెళ్లిపోయింది.

రాత్రి ముగ్గురూ కలిసే భోజనాలు చేశారు. కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు ముగించేసరికి పది దాటింది. నారాయణ ముందు ఆమె ప్రవర్తన విభిన్నంగా ఉంటుంది. తమతో పాటు ఇంట్లో సూరి ఉన్న సంగతి ఆమె మర్చిపోతుంటుంది. నారాయణకు ఎక్కడలేని కబుర్లు చెబుతూ ఎంతో సంతోషంగా గడిపేస్తుంటుంది. లేనప్పుడు తన గదికే పరిమితమయి ఉండిపోతుంది. అవసరమనిపిస్తేనే సూరితో మాట్లాడుతుంది. లేకపోతే లేదు.

చాప, పరుపు తీసుకుని బయటకు వచ్చి అరుగుమీద పరుపు పరిచి పడుకున్నాడు సూరి. తొమ్మిది దాటిందంటే సూరి నిద్రకు ఆగలేదు. నారాయణ వచ్చాడు కాబట్టి వంట వండటం ఆలస్యం అవటాన పడుకోవటం కూడా ఆలస్యమయింది. నడుం వాల్చగానే నిద్ర పట్టింది. గంటన్నర పాటు నిద్రపోయి ఉంటాడు. పడకగదిలో పిన్ని, నారాయణ పెద్దపెద్దగా అరుచుకుంటున్న గొడవకు సూరి నిద్రకు భంగంకలిగింది. లేచి గోడకానుకుని కూర్చున్నాడు. మాటల యుద్ధం పదినిమిషాల తర్వాత తీవ్రతరమయింది. నారాయణ పిన్నిని కొడుతున్నాడు. ఆమె ఏడుస్తున్న శబ్దం బయటకు వినిపించకుండా నోరు నొక్కి పట్టుకున్నట్టు అనిపించింది. కొట్టి కొట్టి పిన్నిని చంపేస్తాడేమో?

నారాయణ ఆమెను వదలగానే వీధి తలుపు శబ్దమయ్యేలా తెరిచి శారద బయటకు వచ్చి అరుగుల మధ్యలో ఉన్న మెట్ల మీద కూర్చుని రెండు చేతులతో ముఖం కప్పుకుని ఏడవటం మొదలెట్టింది. అప్పటివరకు ఒకరిమీద ఒకరు ఎంతో ప్రేమగా మెలిగిన వాళ్లు ఎందుకిలా ప్రవర్తిస్తున్నారో సూరికి అర్థం కాలేదు. వాళ్లను పట్టించుకోవడం మానేశాడు. పిన్ని మీద జాలి వేస్తోంది. తన విషయాల్లో జోక్యం కల్పించుకో వద్దన్నదని వాళ్ల పోట్లాటలకు దూరంగా ఉంటున్నాడు. ఓదార్చాలని కూడా అనిపించటం లేదు.

దుఃఖం ముంపు తగ్గిన తర్వాత చీర కొంగుతో కళ్లు ముఖం తుడుచుకుని, "దొంగ చచ్చినోడు... గొడ్డును బాదినట్లు బాదాడు" అంటూ సూరికి వీపు చూపించింది శారద. వీధి దీపపు వెలుగు మెట్ల వరకు రావటం లేదు. చీకట్లో ఏమీ కనిపించలేదు సూరికి. "వెధవన్నర వెధవ.. ఖర్మకాలి వీడి పాలిట పడ్డాను... నన్ను పెళ్ళి చేసుకుంటాడట... పెళ్లి... వీడి పెళ్ళాన్ని ఎవడికిస్తాడో మరి... నా జీతం తెచ్చి వీడి చేతిలో పెట్టాలట, వీడికో వీడి అబ్బకో బాకీ ఉన్నట్లు... ఇప్పటికే నా దగ్గిర ఎంతో తీసుకు పోయాడు... తిరిగిచ్చాడా? కానీకి కొరగాని వెధవ. వీడి పెళ్లాం అడ్డగోలుగా సంపాయించింది నా దగ్గరేమయినా దాచాడా? మీ నాన్న గారి కుటుంబ పెన్షన్ వీడికి కావాలట. ఇవన్నీ ఇచ్చి నువ్వూ, నేనూ చిప్ప పట్టుకుని రోడ్డుమీద అడుక్కు తినాలి. థూ" అని కాండ్రించి ఊసింది. మరో పావుగంట వరకు లోపలున్న నారాయణకు వినిపించేలా తిడుతూనే ఉంది. దగ్గిర్లో మరొక ఇల్లు లేకపోవటం వలన వేరేవాళ్లు వినే అవకాశం లేదు.

అరగంట తర్వాత నారాయణ బయటకు వచ్చి శారద పక్కనే కూర్చుని, "నేను పశువులా ప్రవర్తించాను" అంటూ ఆమె చేతులు పట్టుకోబోతుంటే విదిలించుకుని "దొంగచచ్చినోడా, నన్ను ముట్టుకోకు" అని అన్నదో లేదో నారాయణ ఆమె కాళ్లు పట్టుకుని, "ఇదో ఈ కాళ్లతో నన్ను తన్ను. ఇహనుంచి నీమీద చేయి వేస్తే నన్ను నీ ఇంట్లోకి రానీయకు... ఈ సారికి నన్ను క్షమించు" అని ఏడవటం మొదలెట్టేసరికి శారద శాంతించింది. అయిదు నిమిషాలాగి, "నన్ను కొట్టి నువ్వెందుకే ఏడవటం?" అని నవ్వింది. అతను లేచి నిలబడి చేయి అందించాడు. చేయి అందుకుని లేచి నిలబడి సూరి వంకయినా చూడలేదు. లోపలకు వెళ్లాక తలుపు కూడా వేసుకోలేదు. సూరి తలుపు దగ్గిరగా లాగి పడుకున్నాడు. నిద్ర ఎగిరిపోయింది. కొద్దిసేపయ్యాక పడక గదిలోంచి శారద నవ్వటం వినిపించింది. అతను చిక్కలిగిలి పెడుతున్నప్పుడు ఆమె అలా నవ్వుతుంది. ఆ నవ్వంటే అతనికి ఎంతో ఇష్టం. పడకగదిలో లైటు ఆరిపోయిన చాలాసేపటికి గాని సూరికి నిద్రపట్టలేదు.

మరుసటి రోజు ఉదయం సూరి నిద్రలేచేసరికి ఎనిమిదిన్నర కావస్తోంది. చాప, పరుపు చుట్టి లోపల పడేసి పడకగది వైపు చూశాడు. గదిలో ఎవరూ లేరు. నారాయణ కాని పిన్నికాని ఇంట్లో ఎక్కడా కనిపించలేదు. ఎక్కడికి వెళ్లారో అర్థం కాలేదు. నారాయణ ఈ ఊరొస్తే బస్సు స్టాండ్ వరకు వెళ్లడు. ఇంటికి దగ్గరగానే రిక్వెస్టు స్టాప్ ఉంది. అక్కడ దిగి వచ్చేస్తుంటాడు. వెళ్ళేప్పుడు కూడా అంతే. తెలతెల వారుతుండగా లేచి వెళ్లి పోతుంటాడు. అతను ఎవరో ఇక్కడి వాళ్లకు తెలియదు.

కాఫీ చేసుకుని తాగుతూ, 'వీళ్లేరి, ఏమయ్యారు ఎక్కడికి వెళ్లారు?' ఇలా ప్రశ్నించుకోసాగాడు సూరి. దేనికీ జవాబు దొరకలేదు. కాని, పెరటిగోడ తలుపు తెరిచి ఉండటం గమనించాడు. ఎప్పుడోగాని ఆ తలుపు తీయటం జరగదు. పెరటిగోడ కవతల ఒక ఫర్లాంగు వరకు ఖాళీస్థలం ఉంది. చివర్లో ఒక పాక ఉంది కాని అందులో ఎవరూ ఉండటం లేదు. ఎప్పుడయినా ఏదయినా జంట అటు వచ్చిగంటా, రెండుగంటలపాటు పాకలో గడిపి వెళ్లి పోతుంటారు. అవతల మామిడితోట ఉంది. మామిడి తోటకు ఆనుకునే పాడుబడి పోయిన బావి ఉంది. శారద మామిడితోట పక్కదారిలో రావటం గమనించిన సూరికి ఆశ్చర్యం వేసింది. అటు వయిపు వెళ్ళటానికి చాలామంది భయపడుతుంటారు. తను కూడా ఒకే ఒకసారి వెళ్లాడు. పిన్ని అటెందుకు వెళ్ళినట్లు? గ్లాసు ఖాళీ చేస్తుంటే శారద లోపలికి వచ్చి పెరటి తలుపు వేసి సరిగా వేశానో లేదో అని లాగి ఒకసారి పరీక్షించి లోపలికి వచ్చి కుర్చీ లాక్కుని సూరికి ఎదురుగా కూర్చుంది. ఫ్లాస్కులోని కాఫీ గ్లాసులో పోసుకుంటుంటే ఆమె చేతులు వణకటం సూరి గమనించాడు. చాలా వేడిగా గ్లాసునిండా ఉన్న కాఫీని మూడు గుటకల్లో తాగి, "నారాయణ కాలు జారి బావిలో పడిపోయాడు." అంది నెమ్మదిగా .

ఉలిక్కిపడి, "ఎప్పుడు?" అడిగాడు సూరి.

"ఇప్పుడే" అంటుంటే శారద కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

తన తండ్రి అదే బావిలో ఏడు సంవత్సరాల కిందట పడి చనిపోయిన విషయం సూరికి హఠాత్తుగా గుర్తు వచ్చింది. ఆయనకు ఈత బాగా వచ్చు కూడా.

◆ విజయ, మాసపత్రిక - జూన్ 1982